# అమృత వర్షిణి

అంకమ్మ అంటే ఒక మామూలు బిడ్డ. బిడ్డ అంటే మగ కావచ్చు, ఆడ కావచ్చు. అంకమ్మ పేరుకూడ అలాంటిదే. లింగభేద రహితమైన ఆపేరు ఈ మగబిడ్డకు ఎందుకు పెట్టారో మాకు అర్థం కావటం లేదు. దానిలో ఆ అబ్బాయి తప్పు ఏమీ లేదు. అతని తల్లిదండ్రులు తమ బంగారు కొడుక్కి ఇచ్చిన ప్లాటినమ్ పేరు. అతనొక మామూలు బిడ్డ అని ఎందుకు చెప్తున్నామంటే అతనికి ఆరు నెలలు నిండగానే మొత్తం పళ్ళు రాలేదు. ఒక సంవత్సరం కాగానే ఆయన 'భజగోవిందం' పాడలేదు. మూడు సంవత్సరాలు రాగానే అతడు 'స్కేటింగ్' నేర్చుకొని 'గిన్నెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో ప్రవేశించడానికి ప్రయత్నం చేయలేదు. అయిదు సంవత్సరాలు రాగానే 'ఆనంద్' లాగా చెస్ ఆట ఆడి 'గ్రాండ్ మాస్టర్' కాలేదు. పోనీ 'బాండ్ మాస్టర్' అయినా కాలేదు. ఏడో యేట 'శకుంతల' మాదిరి తానొక సూపర్ కంప్యూటర్ అని పేరు తెచ్చుకోలేదు. పదోయేటికి రామనాథన్ కృష్ణన్ లేక రామనాథన్ కృష్ణన్ కొడుకు రమేష్ కృష్ణన్ అయినా కాలేదు. పన్నెండో యేట తైలవర్ణ చిత్రాలు రచించి, ఒక ప్రదర్శన నిర్వహించి 'పికాసో' లేక యం.యఫ్. హుస్సేన్ వంటి ప్రసిద్ధ కళాకారుడు కావాలన్నకోరిక ఆ లేత మనసులో చిగిరించలేదు.

ఆ పన్నెండు సంవత్సరాల ప్రాయంలో అంకమ్మ తాను శైశవం దాటిపోయిందని అనిపించడం మొదలు పెట్టింది. దానికి కారణం అతని క్లాసులో అతనే పెద్దవాడు కావడంవల్ల కాదు. అలాంటి ప్రథమ స్థానం లభించడానికి అతనికి అర్హత లేదు. అది తండ్రి పట్ల భయంవల్ల కావచ్చు. పరీక్షలకు కొన్ని రోజులు ముందునుంచి గట్టిగా కూర్చుని బట్టీ కొట్టి ఒక్కొక్క క్లాసు నుంచి మెల్లగా మరో క్లాసుకు పాకటంవల్ల కావచ్చు... సహాధ్యాయులలో అతని వయస్సు 'మినిమమ్'లోనే ఉండేది.

తానిప్పుడు శిశువు కాదు అని అనిపించడానికి తగిన కారణం ఉంది. ఆ అనిపించడం అనే పొగ వెనక సిగరెట్ అంచున ఉన్న సాక్షాత్తు నిప్పే కారణ భూతమై అతని అధర చుంబనకోసం కాలుతూ దగ్గరగా వచ్చే కార్యక్రమం పన్నెండో యేట ప్రారంభమయిన కౌమార ప్రేమకు ప్రత్యక్ష నిదర్శనం.

పదిహేనో యేటివరకు అతను పెద్దవాళ్ళ దృష్టికి రాకుండ పొగతాగేవాడు. ఆ రహస్య కార్యక్రమం చేసేటప్పుడు అతనివెంట ఇద్దరో ముగ్గురో స్నేహితులు ఉండేవారు. ఆ కార్యక్రమం స్కూల్లోగాని, బైటగాని చేసేవాడు. మొదట్లో వారానికి ఒకసారి, తరవాత తరవాత అది రోజువారీ అలవాటుగా మారింది. అయితే ఒక సిగరెట్ పాకెట్ ఒకసారి కొనడానికి గాని, అది జేబులో పెట్టుకొని తిరగడానకి గాని, సొంత ఇంటిలో పొగతాగడానికి గాని అతనికి ధైర్యం ఉండేది కాదు. అతని దగ్గర గాని అతని స్నేహితుల దగ్గరగాని డబ్బులేని కొన్ని సందర్భాలలో ఇతరులు బీడికి అధఃపతనం చెందినా, అంకమ్మ తన స్థాయినుంచి కిందికి జారేవాడు కాదు.

అలా అంకమ్మ, అతని స్నేహితులు ఇంటర్మీడియట్ శ్రేణిలో చేరి కాలేజీ కుమారులన్న పదవిని సంపాదించడం జరిగింది.

వయస్సు పదహారు కాలేదా? ఇంకా ఎవరికి ఎందుకు భయపడాలి? అంకమ్మ జేబులో సిగిరెట్ పాకెట్ స్థిరవాసాన్ని పొందింది.

అయితే ఇంట్లో ఎవరికీ ఈ విషయం తెలియకూడదని మాత్రం అతనికి జాగ్రత్త ఉండేది. క్షిప్రకోపి అయిన తండ్రికి ఈ విషయం తెలిస్తే ఆయన ప్రతిస్పందన తనకు అనుకూలంగా ఉండదని అంకమ్మకు బాగా తెలుసు.

అలా ఉండగా, ఒక సెలవురోజు అంకమ్మ, ముగ్గురు స్నేహితులు ఒక స్నేహితుని ఇంట్లో కలిశారు. మధ్యాహ్న భోజనానికి ముందు ఒక బాటిల్ 'జిన్' వాళ్ళ గొంతుల్లోకి మెల్లగా జారింది. 'జిన్'కు ఒంటరిగా సంచరించడం ఇష్టం లేదేమో! 'లెమన్ కార్డియల్' అనే తన ప్రాణమిత్రంతో చేతులు కలిపి ఆ పిల్లల అధరాలవైపు అంతే యాత్ర సాగించింది. లేదా అవి సహగమనం చేశాయా? అంటే 'జిన్' అనే భర్త చితిలోకి 'లెమన్ కార్డియల్' అనే పతివ్రతా మణి సంతోషపూర్వకంగా సహగమనం చేసిందేమో! కాదు... అంకమ్మ, అతని మిత్రులు ఆ యువ మిధునాల్ని బలవంతంగా దహింపజేశారు. ఏమయినా, తమ దహనయాత్రలో వాళ్ళిరువురూ దుఃఖించలేదని మాత్రం కాదు. తమ దీర్ఘయాత్ర వల్ల కలిగిన ఉల్లాసాన్ని - అంకమ్మతో, స్నేహితులతో పంచుకున్నారు.

అంకమ్మకు ఆ అనుభవం చాలా నచ్చింది. పొగ పీల్చినపుడు ఎప్పుడూ రాని ప్రత్యేక అనుభూతిని మద్యపానం వల్ల పొందాడు. అందువల్ల సెలవురోజులన్నీ ఆ తాగుడు సమావేశానికే అంకితమైపోయాయి. అలాంటి ఉల్లాసోన్మేష దినాలకోసం వేచి ఉండడం కూడ ఒక రకమైన మత్తును ప్రసాదించేది.

అలా రెండు సంవత్సరాలు గడిచి పోయాయి. అంకమ్మ ఇంటర్మీడియట్ దాటి డిగ్రీ క్లాసుకు వచ్చాడు. అతను అప్పుడే గ్రాడ్యుయేషన్ క్లాసులో అడుగు పెట్టాడు కాని తాగుడు విషయంలో అతను అప్పటికే గ్రాడ్యుయేట్ అయ్యాడు. అయితే, ఇంకా దీనికోసం సెలవు రోజుల అవసరం కూడా లేకుండ చేసుకున్నారు. ఏరోజు కావాలంటే ఆరోజు ఇంట్లో సినీమాకు వెళ్తున్నానని చెప్పి స్నేహితులతో కలిసి అమృతపానం చేయడం అసాధారణం కాని ఒక విషయం అయిపోయింది. అతనికి అదొక తప్పని అసలు అనిపించలేదు. ఎందుకంటే అతని తండ్రికి కూడ మధు, దూమపానాలు దైనందిన కార్యక్రమాలే.

ఒక సెలవురోజు మధ్యాహ్నం అంకమ్మ, అతని స్నేహితులు ఆ ఊరిలో ఉన్న ఒక పెద్ద హోటల్లోని బార్‌లో ఒక ప్రత్యేక సెలబ్రేషన్ కోసం చేరి ఉన్న సమయంలో తలమీద పిడుగు పెడ్డట్టు ఒక అఘాతం వచ్చి పడింది. దాదాపు మంచి మూడ్ కు

వచ్చిన అంకమ్మ తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. ప్రవేశద్వారం ద్వారా లోపలకు వస్తున్నవాడు సాక్షాత్తు తన తండ్రేకదా! ఆయనతో మరో ఇద్దరు స్నేహితులు కూడ ఉన్నారు. వాళ్ళుకూడా తనకు పరిచితులే... వాళ్ళల్లో ఎవరయినా తనను చూస్తే తనగతి ఏమవుతుంది? అని భయపడి అంకమ్మ 'మెను' కార్డు ముఖానికి అడ్డంగా పెట్టుకుని దాన్ని చదువుతున్నట్లు నటించాడు. రహస్యంగా ఆ విషయాన్ని మిత్రులకు చెప్పి ఇద్దరు మిత్రులను తనకు అడ్డంగా పెట్టుకుని మెల్లగా బార్ బైటికి వచ్చి మిత్రులకు క్షమాపణ చెప్పి ఇంటికి పారిపోయాడు. తలకెక్కిన ఉత్సాహమంతా అలాగే దిగిపోయింది. అతని గుండెదడ వాల్యూం ఎక్కువవడం వల్ల దాదాపు ఒక అరగంట వరకు అతనికి స్టీరియో ఫోనిక్ సౌండ్స్ వింటున్నట్లు అనిపించింది.

అతని తల మండిపోతున్నట్లుగా ఉంది. కానీ కొంచెం సేపయ్యాక తండ్రి ఇంటికి వచ్చి హాయిగా నిద్రపోతుండడం గమనించాడు. అయితే బార్‌లో తనను తండ్రి చూడలేదన్న కొంచెం సేపు మనసు నెమ్మదించి గదిలో నుంచి బైటికి వెళ్లకుండా ఉండిపోయాడు.

సంధ్యా సమయంలో అంకమ్మకు తండ్రి నుంచి పిలుపు వచ్చింది. అంకమ్మకు తలమీద పిడుగు పడింది. గుండె దడ వేగాన్ని పుంజుకుంది. తండ్రి ముందు తలెత్తి నిలుచునే ధైర్యం అసలే లేదు. అయితే ప్రస్తుత పరిస్థితిలో తలను ఎక్కడ వేలాడదీసి నిలబెట్టాలో తెలియక సతమతమయ్యాడు.

''ఒరే! అంకమ్మా''

ఏంటి ఇదొక గర్జనా! అని అనిపించినా తండ్రి స్వరంలో కటుత్వం లేశమయినా లేదని తెలుసుకోడానికి కొంచెం సమయం పట్టింది. అప్పుడు తల కొంచెం ఎత్తి తండ్రి ముఖంవైపు చూచాడు. ఆయన కళ్ళు ఎర్రగా లేవు. ఆ ముఖంలో రౌద్రభావం లేదు. కానీ ఆ ముఖంలో ఇదమిత్థంగా చెప్పలేని గంభీరత ఉంది.

''నువ్వు తాగడం మొదలు పెట్టి చాలాకాలమయిందా?''

''లేదు'' అనే ఎంతో పొట్టి అయిన ఆ జవాబు అతని కంఠం నుంచి ఎంతో కష్టంతో ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా బైటికి వచ్చింది.

''లేకపోతే బార్ దాకా వెళ్ళడానికి ధైర్యం ఎలా వస్తుంది? ఫరవాలేదు నా అలవాటు రోజూ చూస్తున్నావు కదా! నేను తాగడం, స్మోక్ చెయ్యడం ప్రారంభించి దాదాపు 30 సంవత్సరాలై ఉంటుంది. నేనిదంతా నా సొంత డబ్బుతో చేశాను. కానీ నీవు ఈ రోజుకూడ స్టూడెంట్‌వి. నీకు సొంత సంపాదన కావాలంటే ఇంకా నాలుగయిదు సంవత్సరాలు ఆగాలి. అంతవరకు నీవు తాగకూడదని నేను చెప్పడం లేదు. తాగు... కానీ నీవు నన్ను చూస్తున్నావు కదా... ఎప్పటినుంచో తాగుతున్నాను. కానీ నేను

ఎలా తాగుతున్నాను? ఎంత తాగుతున్నాను? అని నీవు గమనించి ఉండవు. తాగడం మొదలు పెట్టిన వాళ్ళకు దాన్ని వదలడం ఇష్టం ఉండదు. చచ్చిపోయేవరకు తాగుతూనే ఉండాలని ఉంటుంది. నీకు గూడ నాలాగే తాగుతూ బతకాలని ఉంటే భద్రంగా తాగు. బాగా ఆలోచించి తాగు. కాలేయం కాలిపోకుండా తాగు. పేగులు హరించిపోకుండా తాగు. ముందు జాగ్రత్త ఉంటే పరితపించ వలసిన పరిస్థితి రాదని నీకు తెలుసు కదా! అందుకే ఈ విషయంలో కూడా మంచి సెల్ఫ్ కంట్రోల్ పాటించడం నీకే మంచిది. అధికమయితే అమృతం కూడా విషమవుతుంది అనే మాట ఎప్పుడు కూడ మరచిపోకుండ ఉంటే నీ భవిష్యత్తు బాగుంటుంది.''

పెను తుఫానులో కొట్టుకొని పోతానని భయపడి వణుకుతున్న అంకమ్మకు అతని తండ్రి మాటలు అమృతపు జల్లయింది.